
# ఆ ముగ్గురూ......

## సూర్యదేవర రామమోహనరావు



**తెల్లవారితే హైద్రాబాద్‌లో ఇంటర్వ్యూ. ఎన్నో ఇంటర్వ్యూల మాదిరి ఇదీ పక్కెన్ కాదన్న నిరాశ మదిలో కదులుతున్నా, చూస్తూ చూస్తూ ఇంటర్వ్యూ వదులుకోలేని సంజయ్ మనసంతా చికాగ్గా, ఆందోళనగా ఉంది**

ఉద్యోగం కోసం మూడేళ్ళుగా తిరగటంతో పాతికేండ్లకే వేదాంతం, నిరాశావాదం చోటు చేసుకున్నాయి సంజయ్‌లో.

ఎన్నో కష్టాలు, బరువులు, బాధ్యతలు మోసిన తండ్రి రంగనాధంలో ఆశావాదం కంటే సెంటిమెంట్ బలంగా ఉండటంతో "ఏమో ! ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చూడొచ్చారు ? అన్ని దండగల్లో ఇదొక దండగ అనుకుందాం. ఈ ఇంటర్వ్యూకి వెళ్ళిరా" అంటూ తీర్మానించటంతో సంజయ్‌కి హైద్రాబాద్ బయలుదేరక తప్పలేదు.

రాత్రి పదకొండు గంటలకి నందిగామ నుంచి హైద్రాబాద్‌కి ఒక ఎక్స్‌ప్రెస్ వుంది. సంజయ్ వెళ్తే ఈ బస్సులోనే వెళ్ళాలి. కరక్టు టైమ్‌కి బయలుదేరితే ఉదయం ఐదున్నరకల్లా హైద్రాబాద్ చేరుకుంటుంది.

రాత్రి పది కావస్తోంది. చలికాలం కావటంతో అప్పటికే చల్లటి ఈదురు గాలి మొదలయింది. తండ్రి హెచ్చరికతో లేచిన సంజయ్ సర్టిఫికెట్స్ వున్న ఫైలు, ఇంటర్వ్యూల కోసమే దాచుకున్న ఒకే ఒక మంచి బట్టల జత జీర్ణం కావస్తోన్న బ్రీఫ్‌కేస్‌లో సర్దుకొని తండ్రిచ్చిన యాభై రూపాయలు భద్రంగా దాచుకొని బస్ స్టాండ్‌కి బయలుదేరాడు.

సంజయ్ బస్‌స్టాండ్‌లోకి అడుగుపెట్టే సరికే బస్ రడీగా ఉంది. సంజయ్ వెంటనే బస్సెక్కి ముందు వరుసలో కండక్టర్ సీటు వెనుక సీటులో విండో సైడ్ కూర్చున్నాడు బ్రీఫ్‌కేస్ వడిలోకి సర్దుకుంటూ.

ప్రయాణీకులు ఒక్కొక్కరే బస్సెక్కుతున్నారు. కాలం పదకొండు గంటలు కావస్తోంది. ఇంకొద్ది నిముషాల్లో బస్ బయలుదేరుతుంది.

సంజయ్ ప్రక్కనే ఒక పల్లెటూరు రైతు కూచున్నాడు. కదిలించకముందే తన వ్యవసాయ బాధలు, ఊరి రాజకీయాలు ఏకరువు పెడుతున్నాడు.

పదకొండు గంటలు దాటి రెండు నిముషాలవుతోంది. డ్రైవర్ బస్ ఎక్కి హారన్ కొడుతున్నాడు, బస్ బయలుదేరటానికి సిద్ధంగా ఉందని తెలియజేయటానికి.

క్రింద తమ తమ బంధువులతో, స్నేహితులతో కబుర్లు చెప్పుకొనే ప్రయాణీకులంతా గుడ్‌బై చెప్పేసుకొని బస్ ఎక్కారు. వారి వెనుకే కండక్టర్ ఎక్కాడు. డ్రైవర్ బస్ స్టార్ట్ చేసి హైద్రాబాద్ రోడ్డువైపుకు త్రిప్పటానికి రివర్స్ చేస్తున్నాడు. అంతలో ఓ కాకీదుస్తులతను పరిగెత్తుకుంటూ వచ్చి డ్రైవర్‌తో ఏదో మాట్లాడాడు. ఏం చెప్పాడోగాని డ్రైవర్ ఇంజన్ ఆపేసి కండక్టర్‌కి సైగ చేసాడు. డ్రైవర్, కండక్టర్ ఓ క్షణం ఏదో మాట్లాడుకున్నారు.

దూరం కావటంతో ఏం మాట్లాడుకుంటోంది వినపడకపోయినా, డ్రైవర్ చెపుతున్నదానికి కండక్టర్ అభ్యంతరం చెబుతున్నట్లుగా అనిపించింది సంజయ్‌కి.

కొద్ది క్షణాల్లోనే డ్రైవర్, వెనుక కండక్టర్ బస్ దిగి ఆఫీసు రూమ్‌లోకి జొరబడ్డారు.

అలా పోయిన వారిద్దరూ ఎంతకూ బయటకు రాలేదు. బస్‌లో ప్రయాణీకులంతా అసహనంగా తమ తమ సీట్లలోంచి కదులుతున్నారు.

అర్థాంతరంగా బస్ ఆపి డ్రైవర్, కండక్టర్ ఎందుకు ఆఫీస్ రూమ్‌లోకి జొరబడ్డారో ఎవరికీ అంతుబట్టడంలేదు.

సంజయ్‌లో కంగారు బయలుదేరింది. ఇంటర్వ్యూకి అందుకోవాలంటే ఉన్న మార్గం ఈ బస్సెక్కటే. ఇది కాస్త అకారణంగా ఆలస్యం చేస్తోంది. అప్పుడే పన్నెండు గంటలయింది. బస్సు వెంటనే బయలుదేరితే తప్ప లాభం లేదు.

అంతలో అంబాసిడర్ కారొకటి సరాసరి

బస్‌స్టాండ్‌లోకి రావటమేగాక తామున్న బస్ ప్రక్కనే వచ్చి ఆగటం సంజయ్‌కి వింతగా అనిపించింది.

బస్‌స్టాండ్‌లో చిన్న కల కలం బయలు దేరింది. కారణం కోసం తడుములాడు కుంటుండగా కారులోంచి ఖద్దరు లాల్చీ, ఖద్దరు పంచె, భుజంమీద ఉత్తరీయం, చేతిలో పొన్నుకర్రతో ఒక భారీశరీరం దిగింది.

ఆ ఆకారాన్ని చూడగానే స్ఫురించింది, అతనెవరయిందీ. వారే ది గ్రేట్ ఎమ్.ఎల్.ఏ. ఏడుకొండలు. పొట్ట కోస్తే నక్కజిత్తులే తప్ప అక్షరం లేని వేలిముద్ర ప్రజా ప్రతినిధి.

ఆర్థిక శాస్త్రంలో అ, ఆ రాని ఎమ్.ఎల్.ఏ.కి దేశ ఆర్థిక స్థితి ఎలా తెలుస్తుంది? ద్రవ్యోల్బణం అంటే అర్థం కాని శ్రీవారికి రూపాయి విలువ, ధరల పెరుగుదల అనేవే అర్థంకావు. ప్రజా సమస్య లేమిటో తెలియదు. తెలిసిందల్లా అక్రమంగా ఎన్ని మార్గాల ద్వారా సంపాదించుకోవచ్చని.

ఖర్మగాలి ఈ మధ్య ఓ రైతు కొద్దిగా పేపర్ జ్ఞానంతో ఇరాన్, ఇరాక్ ఎందుకు కొట్టుకుంటున్నాయి అనడిగితే "ఆ మాత్రం తెలియదూ ... మినిష్టరు సీటు కోసం" అన్నాట్ట చటుక్కున. హతోస్మి ... భారత రాజకీయాలు ... ప్రజా ప్రతినిధులు ... అనుకుంటూ చల్లగా జారుకున్నాడా రైతు. సంజయ్ శ్రీవారి జ్ఞాపకాల నుంచి బయట పడ్డాడు. ఎమ్.ఎల్.ఏ., శ్రీవారి చుట్టూ జనం ప్రోగడిపోయారు. అంతలో బస్ స్టాండ్ ఆఫీసులోంచి డ్రైవర్, ఆఫీసుక్లర్కు పరిగెత్తుకుంటూ వచ్చి శ్రీవారికి ప్రణామాలు అర్పించారు.

దాదాపు మరో పావుగంటకు శ్రీవారు తన జరీ కండువా సర్దుకుంటూ, తెచ్చి పెట్టుకున్న రాజ ఠీవితో వచ్చి తామున్న బస్ ఎక్కి ముందు సీటులో కూర్చున్నాడు. వారితోపాటు వారి మిత్రుడు సేఠ్ ఒకాయన వారి ప్రక్కనే కూర్చున్నాడు. సేఠ్ చేతిలో తోలు సంచి చూడగానే ఏదో జరగరాని పనేదో జరిపించుకోవటానికి శ్రీవారిని, బరువుని తీసుకొని రాజధాని నగరానికి బయలు దేరినట్లనిపించింది సంజయ్‌కి.

బస్ ప్రక్కన నిలబడ్డ శ్రీవారి భజన బృందం శెలవు తీసుకుంటామన్నట్లు వినయంగా వంగి వంగి నమస్కరిస్తున్నారు. వారికి అభయమిస్తున్నట్లు, మీ పనులు చేయటానికే హైదరాబాద్ వెళ్తున్నట్లు,

# ఆ ముగ్గురూ...

ఎలాంటి రూల్స్‌నైనా అతిక్రమించి మీ పనుల్ని చేసి పెడతానికే గదా డబ్బు పుచ్చు కుంటున్నట్లు తన వామ హస్తం అలవోకగా గాలిలో కదిపారు శ్రీవారు.

శ్రీవారు ఎక్కి ఎక్కటంతో చెక, చెక డ్రైవర్ తన సీటులో కూచుని ఇంజన్ స్టార్టు చేసాడు.

బస్‌లో వాళ్ళంతా ఊపిరి పీల్చుకున్నారు ఒంటిగంట కన్నా బస్ బయలుదేరినందుకు.

బస్‌లో కొంతమంది ప్రయాణీకులు తమ సీట్లలోంచి లేచివచ్చి శ్రీవారి ఎదురుగా చేతులు కట్టుకొని తలవొంచి నిలబడి వారు చెప్పే ఉపన్యాసం వింటున్నారు భక్తితో.

శ్రీవారి వెనుక సీట్లోనే ఉన్న సంజయ్‌కి ఈ న్యూసెన్స్ భరింపరానిదిగా వుంది.

సంజయ్ టిక్కెట్టు తీసుకొని పెరిగిన బస్ ఛార్జీలు తలచుకొని నిట్టూర్చాడు. డీజిల్ రేటు, బస్ ఛాసిస్ రేటు, టైర్స్ రేటు, స్పేర్ పార్టుల రేటు పెరిగినందున ఛార్జీలు పెంచక తప్పటంలేదు. ఇందులో మా తప్పేంలేదు అంటూ సమాచార శాఖవారి ప్రకటనలు చెబుతున్నాయి.

దుబారా ఖర్చు, టైర్స్, స్పేర్ పార్ట్స్ అదృశ్యం కావటం, టికెట్ లెస్ ట్రావెలర్స్‌ని అనుమతించటం, ఛైర్మెన్ పదవుల్లో వుండే పెద్దలు అందినంతవరకూ తినటం మూలాన నిర్వహణా భారం పెరిగి అది సామాన్య మానవుడి మీద పడుతోంది అనేది నిర్వివాదాంశం.

పెద్దగా ఉపన్యాసం ఇస్తున్న శ్రీవారు ఉండుండి వేస్తున్న చచ్చు జోక్కి తనే పెద్దగా నవ్వటం, దానికి భజన బృందం వంత, భరించటం ప్రయాణీకులకి ఇబ్బందిగా ఉన్నా చేసేదిలేక ఊరుకున్నారు.

బస్సులో ప్రయాణీకులందరికి టిక్కెట్టు కొట్టాడు కండక్టర్. ఆఖరిగా శ్రీవారి ప్రక్కనున్న సేఠ్‌ని ఉద్దేశించి 'టిక్కెట్ ప్లీజ్' అన్నాడు.

సేఠ్ తలెత్తి కండక్టర్‌వైపు ఆశ్చర్యంగా చూసాడు, నేనూ సాధారణ ప్యాసెంజర్లా టిక్కెట్ తీసుకోవాలా అన్నట్లు.

ఆ చూపులకి అర్థం తెలియని ది యంగ్ కండక్టర్ మరలా 'టిక్కెట్ ప్లీజ్' అన్నాడు సౌమ్యంగా.

ఏమిటీ నీ ధైర్యం? ఏమిటీ అఘాయిత్యం? అన్నట్లు చూసాడు సేఠ్ ఈసారి కండక్టర్ వైపు. వెంటనే తనని అనుకొనున్న శ్రీవారి చూపుల్లోనే చూపిస్తూ కండక్టర్‌ని కళ్లతో గదమాయించాడు.

'నేను, ది గ్రేట్ ఎమ్.ఎల్.ఏ. శ్రీవారి ప్రక్కనే కూచోవటం, వారికి అతి సన్నిహితుడ కావటమే నా అర్హతగా భావించి టిక్కెట్ కొట్టనవసరంలేదని ఎంతకీ ఈ కుర్ర కండక్టర్ అర్థం చేసుకొని చావడేం' అని సతమతమవుతున్నాడు సేఠ్.

మూడోసారి మరలా 'టిక్కెట్ ప్లీజ్' అన్నాడు కండక్టర్ అసహనంగా.

ప్రయాణీకులంతా ఆశ్చర్యంగా ఈ తంతు చూస్తున్నారు.

అంతలో 'ఏరోయ్ కండక్టరూ వీడు మనోడే' అన్నాడు శ్రీవారు తాపీగా.

కండక్టర్, సంజయ్‌తోపాటు బస్‌లో ప్రయాణీకులంతా ఆశ్చర్యపోయారు శ్రీవారి ధోరణికి.

సేఠ్ గొప్పగా ఫీలవుతూ తన వేస్ట్ కోటు సర్దుకున్నాడు కండక్టర్ వైపు, మిగతా ప్రయాణీకుల వైపు చూపులు మార్చి మార్చి చూస్తూ. 'ఇంతమంది జనంలో తనొక్కడే గదా ఎమ్. ఎల్. ఏ గార్కి అతిసన్నిహితుడు' అని చాలా గర్వంగా ఉంది సేఠ్‌కి.

టిక్కెట్ తీసుకోకపోవటమేగాక, ఏరోయ్ అని శ్రీవారు సంబోధించటం కండక్టర్‌కి బాధ కల్గించింది.

ఎమ్. ఎల్. ఏ కి పాస్ వుంటుంది. అంతవరకు బాగానే వుంది. ఎమ్. ఎల్. ఏ ప్రక్కనున్నతను అతని అనుచరుడైతేనేం, అంగరక్షకుడైతేనేం, భక్తుడైతేనేం, భజన పరుడైతేనేం? అవేమి బస్ పాస్‌కి అర్హతలు కావుగదా!

ఇవే భావాలు బస్‌లోని అందరిలో కల్గాయి, ఒక్క శ్రీవారికి, సేఠ్‌కి, వారి భజనపరులు ఇద్దరు ముగ్గురికి తప్ప.

కండక్టర్ ఎంతవరకు నిలబడగలడు? సాధారణ ఉద్యోగి. బ్రతుకుదెరువుకి ఉద్యోగం చేస్తున్నవాడు. బ్రతుకంటే భయముంటే వుండవచ్చు. బ్రతుకంటే భయమున్నవాడ నీతికి, నిజాయితీకంటే బ్రతుకుదెరువుకే కట్టుబడతాడు. ఇతను అలాగే కట్టుబడొచ్చు. ఈ మాత్రమైనా నిలబడ్డాడంటే అతనిలో ఏ మూలో ఆవగింజంత నిజాయితీ ఉండి వుంటుంది. సంజయ్ ఆలోచనలు ఇలా సాగుతున్నాయి.

'అదెలా వీలవుతుంది ? పాస్ మీకు. సేఠ్ టిక్కెట్ తీసుకోవాలి' ధైర్యంగా అన్నాడు కండక్టర్.

కండక్టర్ నీతి, నిజాయితీకి ఆ పైన అతని ధైర్యానికి "హియర్, హియర్" అంటూ చప్పట్లు కొట్టాలని బస్‌లో వాళ్ళందరికి అనిపించినా, బ్రతుకంటే భయపడేవాళ్ళు గనుక మనస్సుల్లో మాత్రమే కండక్టర్‌కి అభినందనలు తెలిపారు.

శ్రీవారికి కండక్టర్ నిజాయితీ తెగ కోసం తెప్పించింది.

"నా విసయం నీకు తెల్దరోయ్ కుర్ర కుంక! నాను టిక్కట్టు అక్కర్లేదంటే అక్కర్లేదంతే" కండక్టర్‌పై విషం కక్కేలా చూస్తూ యాసగా అన్నాడు.

అయినా కండక్టర్ కదల్లేదు అక్కడ్నుంచి. ఆ క్షణంలో అతని ముఖంలో కన్పించే టెన్షన్ చూస్తే, తన ఉద్యోగ ధర్మం కోసం ఎంత పట్టుదలగా నిలిచింది అర్థమవుతుంది.

"నా కెదురు తిరిగినోడెవడూ బతికి బట్ట కట్టలా. నాను తలుచుకుంటే రేపే పాటికి నిన్ను శ్రీకాకుళం అడవుల్లోకి ట్రాన్స్‌ఫర్ చేయిత్తా, తెలిసిందా ?" శ్రీవారు ఫైర్ అయిపోయాడు.

"రేపటి దాకా నేనీ ఉద్యోగంలో వుంటే ట్రాన్స్‌ఫర్ చేయిద్దురుగాని. ఇంకాసేపట్లో చెకింగ్ స్క్వాడ్ వస్తే ఈ రాత్రే నా ఉద్యోగం పోతుంది, ఇతనికి టిక్కెట్ కొట్టకపోతే" అన్నాడు కండక్టర్ వ్యంగ్యంగా.

"ఓరి కుర్రినాయాలా ! అదా నీ భయం ? అది సెప్పేడవ్వేం ? నీకేం కాకుండా చూత్తాలే చెకింగోళ్ళొస్తే" అన్నాడు శ్రీవారు ధీమాగా.

"ఒక ప్రజా ప్రతినిధిగా మీరు ఇలా చేయటం ఏం బాగోలేదు. నిజాయితీని ప్రోత్సహించాల్సిన మీరే ఇలా చేయటం దారుణం" అన్నాడు సంజయ్ ఆ దౌర్జన్యం సహించటం ఇక తనవల్లకాక.

శ్రీవారు గిరుక్కున వెనక్కి తిరిగి చూసాడు. బస్‌లో వాళ్ళంతా సంజయ్ ధైర్యానికి విస్తుపోయారు.

కండక్టర్ మొఖం ఓ క్షణం మతాబులా వెలిగింది, తనని సపోర్ట్ చేసేవాళ్ళు ఒకళ్ళయినా ఉన్నందుకు.

ఈ చిన్న సపోర్ట్ చాలు నాకన్నట్లు నిర్భయంగా టిక్కెట్ కొట్టితీరాలనే పట్టుదల కొచ్చాడు కండక్టర్.

# ఆ ముగ్గురూ...

"మీ కుర్రనాయాళ్ళకి బతకటం తెల్దు. మర్యాదగా కూకోండి. ఇంకాట్టే వాగితే చేయి చేసుకోవాల్సొత్తది." తన అవాగిరికతని వెల్లబెట్టాడు శ్రీవారు తన మాటలద్వారా.

ఈ గలాభా అంతా చూసిన సేఠ్‌కి కంగారు పట్టుకుంది. టిక్కెట్ తీసుకోక పోయినందుకు ఇంత గొడవ జరుగుతుందనుకో లేదు. ఎప్పటిలాగే ఫ్రీగా పోతుందనుకున్నాడు. కాని ఈసారికిక లాభంలేదు, అనే నిర్ణయాని కొచ్చి 'ఎందుకొచ్చిన గొడవ. టిక్కెట్ తీసుకుంటాలెండి' అన్నాడు సేఠ్ శ్రీవార్ని ఉద్దేశించి.

"ఠశ్... వీల్లేదు... టిక్కెట్ కొనలేక కాదు, ఇది నా ప్రెస్టేజి కొచ్చెను. నన్ను ఈ కుర్ర కండక్టర్రూ, బ్రతుకుదెరువుకి కాకీ బట్టలేసుకొని, తోలు సంచి తగిలించు కున్న ఈ ముస్టోడు నన్ను సవాల్ చేత్తాడా? వీడెంత, వీడి బతుకెంత? ఆర్‌టీసీ మినిస్టర్‌కి ఒక్క ఫోను కొడితే రేపేపాటికి పుట్టుపోతు మీదుంటాడు" అగాడు శ్రీవారు ఆయాస పడిపోతూ.

ఇంతలో డ్రైవర్ బస్‌కి బ్రేక్ వేసి కండక్టర్‌కి సైగ చేసాడు.

డ్రైవర్ ఏం హితబోధ చేసాడోగాని కామ్‌గా ఇంజన్ ప్రక్కనే ఉన్న సింగిల్ సీటులో కూర్చుంటూ ఓసారి శ్రీవారి వైపు, సేఠ్ వైపు చూసాడు కండక్టర్.

ఆ చూపుల అర్థం వారికి తెలిస్తే ఉరేసుకొనుందురు.

* * *

"నిజమే... ఇందులో నీ తప్పేం లేదని వ్యక్తిగతంగా నమ్ముతున్నాను. నీ నిజాయితీని అభినందిస్తున్నాను. కాని నేనూ ఉద్యోగినే. నువ్వు క్రింది తరగతి, నేను పై తరగతి. ఈ తేడాయే తప్ప ప్రస్తుత పరిస్థితుల్లో మరింకేంలేదు. ఎంత ఐ. ఏ. యస్. అయిన ఐ. పి. యస్. అయినా అధికార పార్టీ ఒత్తిడులకి లొంగాల్సిందే.

నీపై ఏ అభియోగం చేయలేదు. కాని నిన్ను సస్పెండ్ చేయమన్నారు. ఎందుకూ అని అడగాల్సిన నా విద్యుక్తధర్మం బ్రతుకు భయంతో బయటపడలేదు.

కారణం ఉన్నా లేకున్నా, ఆ కారణం సబబైనది అయినా కాకున్నా పైవాళ్ళు చెప్పారు గనుక నిన్ను సస్పెండ్ చేయక తప్పదు. ఇందుకు నీ మీద నేను వ్యక్తిగత సానుభూతి చూపించటం తప్ప మరేమి చేయలేను. ఎందుకంటే ఈ దేశంలో అందునా ఈ సమాజంలో బ్రతకాలి అంటే కొన్నిటిని దాచుకోవాలి, మరికొన్నిటిని అమ్ముకోవాలి, ఇంకొన్నిటిని తాకట్టు పెట్టాలి.

నీవు నీతికి, నిజాయితీకి కట్టుబడ్డావు. మంచిదే. కాని ఆ సందర్భంలో కొండను ఢీ కొన్నావు. అదే ఇంతకీ చేటు."

"ఇదెంత అన్యాయం సార్? నా విద్యుక్త ధర్మం నిర్వర్తించినందుకు సస్పెండ్ చేయటం ... " అర్థోక్తిలో ఆగాడు కండక్టర్.

సిగ్గుతో, అవమానంతో తలవొంచుకున్న ఓ ఐ. ఏ. యస్. ఆఫీసర్ కండక్టర్ ముఖంలోకి చూడలేక "నేను ఒక సహాయం మాత్రం చేయగలను; నీ ఉద్యోగం పోకుండా చూస్తాను. అంతకు మించి నేనేం చేయలేను. ప్లీజ్ అండర్‌స్టాండ్ మీ" -ఓ సీనియర్ ఐ.ఏ.యస్. ఆఫీసర్, గొప్ప అడ్మినిస్ట్రేటర్‌గా పేరు తెచ్చుకున్న ఆఫీసర్ పాతికేండ్లు నిండని ఓ యువ కండక్టర్ ముందు తలొంచాడు వ్యవస్థని తిట్టుకుంటూ, అలాంటి వ్యవస్థలో తనూ ఒక సమిధ అయినందుకు నొచ్చుకుంటూ.

"బ్రతుకు భయంతో నా నిజాయితీని అమ్ముకొని జీవితాంతం కుళ్ళి కుళ్ళి చావలేను. నా ఉద్యోగానికి ఈ రోజే రాజీనామ చేస్తున్నాను" అన్నాడు ఒక స్థిర నిశ్చయా కొచ్చిన కండక్టర్.

కుళ్ళిపోయి దుర్గంధ భూయిష్టమై వ్యవస్థలో పుట్టిన ఒక యువతరం ప్రతినిధ నీతి, నిజాయితీ కోసం స్వచ్ఛందంగా బ అయిపోతుంటే తొలిసారిగా తనమీద త జాలిపడ్డాడు ఓ బిగ్ ఆఫీసర్.

నిజాయితీకి నిలబడి పరాజయం పొంది తల వొంచిన ఓ సాధారణ ఉద్యోగి, అవినీతికి నిలబడి దాన్నే గెలిపించి దాన్ని తన ఘన విజయంగా భావించి తలెగురవేసిన ప్రజా ప్రతినిధి, బ్రతుకు భయంతో తనని తానే తాకట్టు పెట్టుకున్న ఓ ఆఫీసర్ ఆ ముగ్గురూ... ఈ వ్యవస్థలోనివాళ్ళే !! ★